క్లుప్తంగా

రైతులకు అవగాహన


మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

బోరజ్: మండలంలోని లేఖర్ వాడలో జిల్లా వ్యవసాయ శాస్త్రవేత్తలు మంగళవారం పర్యటించారు. పత్తి, సోయా, కంది పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు డాక్టర్ రాజశేఖర్, మోహన్ దాస్ మాట్లాడుతూ పత్తిలో కాండం కుళ్ళు నివారణ, సోయాబీన్‌లో చిగురాకులు పసుపు రంగులోకి మారకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కంది పంటలో మొక్క మొదళ్ల వద్ద నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. రైతులు రమేష్, కరీం, భోజన్న, తదితరులు పాల్గొన్నారు.

కుమారి ఆశ్రమంలో శ్రావణమాస పూజలు


పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

నేరడిగొండ: మండలంలోని కుమారి గ్రామంలో గల శ్రీ గురుదేవ సేవా ఆశ్రమంలో శ్రావణ మాసం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా 41వ రోజులు ఆశ్రమ సభ్యులతో పాటు గ్రామ పెద్దలు, గ్రామస్తులు కలిసి ఆశ్రమంలో అఖండ జ్యోతిని వెలిగించనున్నారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా భజన కార్యక్రమాలు చేపట్టారు.

విద్యార్థులకు పులులపై అవగాహన ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కృష్ణ

తలమడుగు: పాఠశాలల్లో చదివే ప్రతీ విద్యార్థికి పులులపై అవగాహన ఉండాలని వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ అన్నారు. ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉమ్రి గ్రామంలోని బాలికల ఆశ్రమ గిరిజన బాలికల ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అడవులను కాపాడుకోలేకపోతే భవిష్యత్‌లో ఇక పులులు కనిపించవన్నారు. వేటగాళ్ల బారినుంచి పులులకు ముప్పు వాటిల్లుతుందన్నారు. పులులను వేటాడే వేటగాళ్లపై అటవీశాఖ తగు చర్యలు తీసుకోవాలన్నారు.

పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ఎస్పీకి వినతి


ఎస్పీని సన్మానిస్తున్న గుడాల అనీష్

బోథ్: యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గుడాల అనీష్ కుమార్‌తో పాటు పలువురు నాయకులు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌ను మంగళవారం జిల్లా కేంద్రంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీని శాలువాతో సత్కరించారు. నూతనంగా ఏర్పడిన సొనాల మండలంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

తీజ్ సందడి


తీజ్ వేడుకల్లో పాల్గొన్న యువతులు

బోథ్: మండలంలోని బాబెరతండాలో మంగళవారం తీజ్ పండుగ నిర్వహించారు. యువతులు అలికిన గోధుమ బుట్టలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు వేడుకలు నిర్వహించనున్నారు.

రోడ్డుకు పోలీసుల మరమ్మతు


మరమ్మతు చేయిస్తున్న సీఐ ప్రభాకర్

నార్నూర్: ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మరమ్మతులు చేస్తున్నారు. మంగళవారం సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో తాడిహత్నూర్–గంగాపూర్ గ్రామాల మధ్య ప్రధాన రోడ్డుపై భారీ వర్షాలతో ఏర్పడిన గుంతలను జేసీబీ సాయంతో పూడ్చివేశారు. ఎక్కడైనా వర్షాలతో రోడ్లపై గుంతలు ఏర్పడితే గ్రామానికి చెందిన యువకులు పూడ్చాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో నాగదేవతకు పూజలు


ఇచ్చోడ: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్


జైనథ్: పుట్టలో పాలు పోస్తున్న భక్తులు


తలమడుగు: పూజలు చేస్తున్న విద్యార్థులు


నేరడిగొండ: పుట్టలో పాలు పోస్తున్న ఎమ్మెల్యే

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో మంగళవారం నాగుల పంచమి పూజలను ఘనంగా నిర్వహించారు. గ్రామ పొలిమేరలో పుట్టల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. చిరుధాన్యాలతో తయారుచేసిన ప్యాలాలు, పుట్నాలతో కూడిన నైవేద్యాన్ని సమర్పించి పుట్టలో పాలు పోశారు.

'సిరిచెల్మ' ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

ఇచ్చోడ: నాగుల పంచమిని పురస్కరించుకుని మంగళవారం మండలంలోని సిరిచెల్మ మల్లన్న ఆలయంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో అతిపురాతన ఆలయంలో సిరిచెల్మ మల్లికార్జున ఆలయం ఒకటన్నారు. కాకతీయుల కాలంలో నిర్మించిన ఈ ఆలయానికి ప్రత్యేకత ఉందన్నారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా పంటలు బాగాపండి ప్రతిఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని మల్లికార్జుడిని కోరినట్లు తెలిపారు.

జైనథ్: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయ సమీపంలో చెరువు పక్కన ఉన్న పుట్టలో భక్తులు పాలు పోసి నాగదేవతను పూజించారు. అనంతరం అక్కడే వంటలు చేసుకుని కుటుంబ సభ్యులతో కలిసి ఆరగించారు.

తలమడుగు: మండలంలోని కుచులపూర్, తలమడుగు, కొత్తూరు, సుంకిడి, కజర్ల, దేవాపూర్, బరంపూర్, లింగి, ఉమ్రి, పల్లి బి, ఖోడద్, గ్రామాల్లో మహిళలు పుట్టల వద్ద పాలు పోసి పూజలు నిర్వహించారు. ఉమ్రీ గ్రామంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు పుట్ట వద్ద పాలు పోసి పూజలు చేశారు.


ఇంద్రవెల్లి: పొల్లుగూడ పొలిమేరలో పూజలు చేస్తున్న ఆదివాసీలు

శివాలయంలో ఎమ్మెల్యే పూజలు

నేరడిగొండ: మండల కేంద్రంలోని శివాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బోథ్ ఎక్స్‌రోడ్‌లో ఉన్న పురాతన పుట్టలో పాలు పోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాగుల పంచమికి పుట్టలో పాలు పోయడం మన సంస్కృతి సంప్రదాయాల్లో భాగమన్నారు. దేవుడి ఆశీస్సులతో ప్రజలకు ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.

చోర్గావ్ శివాలయంలో ఆధ్యాత్మిక శోభ

నార్నూర్: నాగుల పంచమిని పురస్కరించుకుని మండలంలోని చోర్గావ్ శివాలయంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ సందర్భంగా మూర్తి రాములు దేవస్థానం పీఠాధిపతి శ్రీ శ్రీరామ్ మహరాజ్ చేతుల మీదుగా ప్రత్యేక పూజలు చేశారు. భోగ్ బండారో నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సంప్రదాయ, ఆటపాటలతో హోరెత్తించారు. శివనామస్మరణతో శివాలయం మారుమ్రోగింది. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాదవ్ శ్రీరామ్ నాయక్, ఆలిండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్ రెడ్డినాయక్, ఫాక్స్ చైర్మన్ ఆడే సురేష్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఊర్వేత రూప్‌దేవ్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: బోథ్, సొనాల మండలాల్లో నాగుల పంచమి వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పుట్టలో పాలు పోసి, నాగదేవతకు పూజలు నిర్వహించారు. కైలాస్ టెకిడి ఆలయంలో నర్మదేశ్వరుడికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి లింబాజీ మహరాజ్‌తో పాటు పలువురు ఉయ్యాలలో ఊగారు. నాగుల పంచమి రోజున ఊయ్యాలలో ఊగడం సంప్రదాయంగా భావిస్తారు


నార్నూర్: పూజలు చేస్తున్న మాజీ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్


నార్నూర్: నృత్యం చేస్తున్న లబానాలు


ఉయ్యాలలో ఊగుతున్న లింబాజీ మహరాజ్

దరఖాస్తుల ఆహ్వానం

బోథ్: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల కళాశాలలో పార్ట్‌టైంగా గణితం బోధించే మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ రాథోడ్ వనిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణితంలో పీజీ, బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు నిర్ణీత తేదీలోగా సంబంధిత డాక్యుమెంట్లతో కూడిన దరఖాస్తు సమర్పించాలని సూచించారు.

మున్నూరు కాపుసంఘం కార్యవర్గం ఎన్నిక

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామ మున్నూరు కాపు సంఘం కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మునిగెల ప్రవీణ్, ఉపాధ్యక్షుడిగా భీమ ఈశ్వర్, సభ్యులుగా కుమ్మరి గంగయ్య, కుమ్మరి నారాయణ, మునిగెల నర్సయ్య, భీమ రాములు, అయిటి సురేందర్, బొడ్డు ఎర్రన్న, తోట నర్సయ్య, నవ్వ లక్ష్మణ్, లక్కాకుల చిన్నయ్య, బొడ్డు వెంకటరమణను ఎన్నుకున్నారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

వాహనాలు తనిఖీ

బోథ్: మండల కేంద్రంలోని 108, 102, 1962 వాహనాలను ప్రోగ్రాం మేనేజర్ స్వామ్రాట్, జిల్లా మేనేజర్ రాజశేఖర్ మంగళవారం తనిఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పైలట్‌లు సెరె సంతోష్, ఈఎన్‌టీ గోపి, రమేశ్, గజ్జె రవి, తదితరులు పాల్గొన్నారు.

నేడు రేషన్ కార్డుల పంపిణీ

బోథ్: నియోజకవర్గంలోని బోథ్, నేరడిగొండ, సొనాలకు సంబంధించిన రేషన్ కార్డుల పంపిణీ బుధవారం బోథ్ మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించనున్నట్లు బోథ్ తహసీల్దార్ సుభాష్ చందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కలెక్టర్ రాజర్షిషా ప్రత్యేక అతిథులుగా హాజరై లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం ఉదయం 11 గంటలకు లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ సత్యనారాయణరావు తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ రానున్నట్లు పేర్కొన్నారు.

బీమా పథకాలతో బాధిత కుటుంబాలకు ధీమా

- ఎమ్మెల్యే పాయల్ శంకర్


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: ప్రమాదవశాత్తు డ్రైవర్లు మరణిస్తే వారి కుటుంబాలకు బీమా పథకాలతో ఎంతో ధీమా లభిస్తుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఇటీవల పెద్దింటి ప్రభాకర్ అనే డ్రైవర్ పాము కాటుతో మృతి చెందగా అతనికి మంజూరైన రూ.10 లక్షల చెక్కును మంగళవారం బాధిత కుటుంబసభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాయల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గతంలో తనవంతుగా డ్రైవర్లకు పోస్టాఫీస్‌లో ప్రమాద బీమా చేయించామన్నారు. డ్రైవర్ల వృత్తి ఎంతో క్లిష్టమైందని, వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ప్రమాద బీమా చేయించినట్లు వివరించారు. గ్రామాలు, పట్టణాల్లో ఇల్లు లేని డ్రైవర్లకు ఇంటి స్థలాలు ఇచ్చేలా కృషి చేస్తానన్నారు. ప్రతీ డ్రైవర్ ప్రమాద బీమా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విట్టల్‌గౌడ్, మోహన్, శంకర్, రమేశ్, అశోక్, స్వామి, విజయ్, మయూర్‌చంద్ర, అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల అభివృద్ధికి ప్రధాని ప్రత్యేక కృషి

బేల: ప్రధాని నరేంద్రమోదీ ఆదివాసీల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మంగళవారం మండలంలోని చప్రాలలో పీఎం జన్‌మన్ నిధులు రూ.2.30 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బాలుర హాస్టల్ భవన నిర్మాణ పనుల శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి వందల కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్ రెడ్డి, వైస్ చైర్మన్ సవాపురే విలాస్, మాజీ నాక్లే రాందాస్, ఆయా పార్టీల నాయకులు ఇంద్రశేఖర్, తాక్రే సాగర్, బోనిగిరివార్ గణేష్, మడావి చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలి'

ఆదిలాబాద్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం సాత్నాల మండలం ఖారా గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతురాజ్ రమేశ్, సుభాష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

అనుమతి ఒకచోట.. అమ్మేది మరోచోట!

- రిమ్స్‌లో ఆ మందుల దుకాణం తీరే వేరు
- విజయ డెయిరీ షాపులో అమ్మకానికి ఇతర వస్తువులు


సూపర్ స్పెషాలిటీకి బదులు రిమ్స్ ఆవరణలో కొనసాగుతున్న మెడికల్ షాప్


విజయ డెయిరీ షాపులో విక్రయానికి ఉంచిన వివిధ వస్తువులు, తినుబండారాలు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో ఓ జనరిక్ మందుల షాపు తీరే వేరు.. రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో నిర్వహించాల్సిన మెడికల్ షాపు నిబంధనలకు విరుద్ధంగా రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో యథేచ్ఛగా కొనసాగుతోంది. కలెక్టర్ ఆదేశాలతో రిమ్స్‌కు గత డిసెంబర్‌లో రెండు మెడికల్ షాపులు మంజూరయ్యాయి. ఇద్దరిద్దరికి కలిపి ఒక్కోషాపును కేటాయించారు. ఈ షాపులు మహిళల పేరిట మంజూరు కాగా ఓ షాపు ఇందుకు భిన్నంగా బినామీలతో కొనసాగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనీసం అగ్రిమెంట్ కూడా చేసుకోలేదని తెలుస్తోంది. ఆ శాఖ అధికారులు సమాచారం ఇచ్చినప్పటికీ పెడచెవిన పెడుతున్నారని తెలిసింది. నెలకు రూ.6వేల చొప్పున అద్దె చెల్లించాల్సి ఉండగా ఇప్పటివరకు ఎలాంటి డబ్బులు చెల్లించకుండా కొనసాగిస్తున్నారు. అలాగే రిమ్స్ ఆస్పత్రి ప్రధాన గేటు దాటిన తర్వాత విజయ డెయిరీకి సంబంధించిన ఓ షాపును ఏర్పాటు చేశారు. ఆ షాపులో పాల ఉత్పత్తులు విక్రయించాలి. కానీ నిబంధనలకు విరుద్ధంగా వివిధ వస్తువులు అమ్ముతున్నారు. రిమ్స్‌లో రెంటల్ అగ్రిమెంట్ చేసుకోవాల్సి ఉండగా పట్టింపులేనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆ శాఖ ఉద్యోగులు చెబుతున్నారు. పలుమార్లు నోటీసులు ఇచ్చినా దాని ఊసే ఎత్తడం లేదని పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా కేవలం విజయ డెయిరీకి సంబంధించి ఉత్పత్తులు అమ్మాల్సిన వారు, ఇతర కంపెనీల వాటర్ బాటిళ్లు, తినుబండారాలు, వివిధ వస్తువులు అమ్ముతూ నిబంధనలు తుంగలో తొక్కుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

హామీల అమలులో కాంగ్రెస్, బీజేపీ విఫలం

- మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న


మాట్లాడుతున్న జోగు రామన్న

ఆదిలాబాద్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు విఫలమయ్యాయని మాజీమంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదిలాబాద్ రూరల్ మండల బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో ప్రతి కార్యకర్త శ్రమించాలని సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్, బీజేపీలు ఇచ్చిన హామీలను ప్రజలకు మరోసారి గుర్తు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేశ్, ప్రహ్లాద్, నర్సింగ్, జగదీష్, పరమేశ్వర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో మిగిలిన సీట్లను ఈ నెల 31న గురువారం స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వినోద్ సాద తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు దరఖాస్తులు స్వీకరించి, 2 గంటల నుంచి మెరిట్ లిస్ట్ ద్వారా స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు.

బోథ్: మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఖాళీగా ఉన్న సీట్లకు గురువారం ఉదయం 9 గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీలో సీట్లు ఖాళీగా ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు.

లంపీస్కిన్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

ఆదిలాబాద్: లంపీస్కిన్ వ్యాధి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి మంగళవారం జిల్లా కేంద్రంలో పశు వైద్యాధికారులను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి వ్యాప్తి కారణంగా పశువులు అనారోగ్యం బారిన పడుతున్నాయని, వ్యాధి నియంత్రణకు అవసరమైన మందులను పశుపోషకులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సురేందర్ రెడ్డి, ఆశన్న యాదవ్, దినేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏటీసీ కేంద్రాలతో సాంకేతిక విద్యలో నైపుణ్యం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: యువత నూతన సాంకేతిక విద్యలో నైపుణ్యం పెంచుకోవడానికి ఏటీసీ కేంద్రాలు దోహదపడుతాయని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నూతనంగా ప్రారంభించిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లో ప్రవేశానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ఉండే కోర్సుల ద్వారా ఉపాధి అవకాశాలు పొందడానికి ఏటీసీవంటి ఆధునిక శిక్షణా కేంద్రాల ద్వారానే భవిష్యత్ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. ఏటీసీలో అందుబాటులో ఉన్న ఇండస్ట్రీ 4.0 ఆధారిత కోర్సులు యువతకు ఉన్నత శిక్షణ, ప్లేస్‌మెంట్ అవకాశాలు, ఇంకా సాంకేతికంగా ప్రావీణ్యం కలిగించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, డీటీవో రాంచందర్, ఏటీవో జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

మూడు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం


కేస్లాపూర్‌లో ట్రాఫిక్ సమస్య ఏర్పడడంతో రోడ్డుపై నిలిచి ఉన్న వాహనాలు

ఇంద్రవెల్లి: మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయంలో నాగుల పంచమి పూజలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు మహారాష్ట్ర నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలి రావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సుమారు మూడు గంటల పాటు ముత్నూర్ నుండి కేస్లాపూర్ గ్రామానికి వెళ్లే రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో నాగోబా దర్శనం కోసం వచ్చిన భక్తులతో పాటు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎస్సై సాయన్న దగ్గరుండి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంతో భక్తులు తమ తమ గ్రామాలకు వెళ్లిపోయారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


నేరడిగొండ: వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

నేరడిగొండ: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నట్లు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్ అన్నారు. మంగళవారం రాజులతండాలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుందనీ ప్రతీఒక్కరు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. ప్రజలకు ఆరోగ్య సంబంధిత విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సాయన్న, ఆశా కార్యకర్త లక్ష్మి పాల్గొన్నారు.

ఇచ్చోడ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది రాథోడ్ కైలాస్, సుభాష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం సుధారాణి, పద్మ, ఆశవర్కర్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

భీంపూర్: మండలంలోని అర్లి(టీ) గ్రామంలో మంగళవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ నిఖిల్ రాజ్ సిబ్బందితో కలిసి 150 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. వర్షాకాలంలో నేపథ్యంలో అంటు రోగాలు ప్రబలకుండా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వైద్యుల సలహాలు, సూచనలను పాటించాలని కోరారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తీర్ణాధికారి జ్ఞానేశ్వర్, పర్యవేక్షకులు రోహిదాస్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశాలకు దారేది..?


నీటికుంటలో నుంచి లేగదూడతో వెళ్తున్న రైతు

బేల: మండల కేంద్రంలోని పశు వైద్యశాల ఎదుట లోతట్టు ప్రాంతం ఉండడంతో వర్షం కురిసిన ప్రతీసారి నీరు నిలిచి ఉంటోంది. మంగళవారం పశు వైద్యం కోసం వెళ్లడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి, పశు వైద్య కేంద్రానికి వెళ్లడానికి సరైన దారిని ఏర్పాటు చేయాలని మండల రైతులు కోరుతున్నారు.